తెలుగు డిజిటల్ దినపత్రిక

# సిరి

...People Voice | www.siridaily.com

బుధవారం, జులై 9, 2025 | సంపుటి-1 సంచిక-209 పేజీలు- 12

The Largest Readers Local Digital Daily


తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును మంగళవారం హైదరాబాద్ నంది నగర్ లో సొంత నివాసంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి తదితరులు ఉన్నారు..

– నర్సాపూర్, జులై 8 (సిరి న్యూస్)







# అడ్డదారిలో అవంతిక!

వివరాలు 3లో

## సాగునీటి వనరులపై అక్రమార్కుల కన్ను..





- అమీన్‌పూర్ లో సహజసిద్ధ వరద కాల్వలను ఆక్రమించిన నిర్మాణ సంస్థ
- భారీ కాల్వను.. చిన్న కాల్వగా మార్పు
- సర్‌ప్లస్ ఛానల్స్ స్వరూపం మార్చి ఫీల్డ్ ఛానల్‌గా మార్చిన వైనం
- మ్యాపులు మార్చి.. కబ్జా చేసిన కాల్వలపైనే నిర్మాణాలు
- కాల్వల ఉనికిని కాలరాస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- భవిష్యత్ వరదలకు బాధ్యులెవరు ?



**రాజు తలచుకుంటే అడ్డేముంది** అన్న చందంగా అక్రమార్కులు తలచుకుంటే అధికారుల నోరు మూయించగలరు... అధికారుల లాలూచీ అక్రమార్కులకు కోట్ల రూపాయలను దోచుకునేలా చేస్తోంది.. ప్రకృతి వనరులను కబ్జా చేస్తూ నోట్ల కట్టలతో అధికారుల నోరు మూయించి బహుళ అంతస్థులను నిర్మిస్తున్నారు.. అధికారులను మామూళ్ళ మత్తులో ముంచి వరద కాలువలను మాయం చేసి..రూటు మార్చి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు..నోట్ల కట్టల మాయలో పడిన అధికార యంత్రాంగం అక్రమార్కులు చెప్పిందే మాటగా తలాడిస్తూ వంతపాడుతున్నారు..దీంతో అక్రమాలను సక్రమాలుగా మార్చి కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తుంది ఓ బడా సంస్థ..వరద కాలువను చెరపట్టి బహుళ అంతస్తులు నిర్మిస్తున్న బడా సంస్థపై చర్యలు తీసుకున్నఅధికారి ఒక్కరంటే ఒక్కరు లేరు.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో వరద కాలువను కబ్జా చేసి భారీ నిర్మాణాలు చేపడుతున్న **అవంతిక నిర్మాణ సంస్థపై సిరి అందిస్తున్న ప్రత్యేక కథనం...**

(రామచంద్రాపురం-సిరిన్యూస్)

## యాజమాన్య నిర్లక్ష్యమే కారణం

- సిగాచి పరిశ్రమను సందర్శించిన ఎన్డిఎంఏ బృందం
- పరిశ్రమ నిర్వహణలో లోపాలు
- ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన కేంద్ర బృందం

4






## కుంట భూమికి.. హద్దులు ఏర్పాటు

- బోర్డు పాతిన అధికారులు
- సిరి కథనానికి స్పందన

5

## మట్టి పోయించారు!

సిరి కథనానికి స్పందించిన అధికారులు
మురదమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు




5



# సీజనల్ ముప్పు..



- వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
- పరిశుభ్రత ఆరోగ్యానికి పునాది
- తాగునీటి భద్రత .. ఏమాత్రం నిర్లక్ష్యం వద్దు
- చెత్త నిర్వహణ మనందరి సామాజిక బాధ్యత

**వర్షాకాలం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొస్తుంది. కానీ, ఈ సమయంలో సీజనల్ వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే, చిన్నపాటి జ్వరం కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అందుకే, ఈ సీజన్‌లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన పూర్తి, స్పష్టమైన మార్గదర్శకత్వలు..**

**పాపన్నపేట , సిరి న్యూస్**

## పరిశుభ్రత,ఆరోగ్యానికి పునాది!

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రత కూడా అత్యవసరం. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా వృద్ధి చెందుతాయి. ఇవి డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వైరల్ జ్వరాలకు ప్రధాన కారణం. ఇంట్లో ఒకరికి సోకితే, అది కుటుంబమంతా వ్యాపించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఇంటి చుట్టూ, పూల కుండీలు, పాత టైర్లు, డ్రమ్ములు వంటి వాటిలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి వీటిని తరచుగా శుభ్రం ఉండేటట్లు చూసుకోవాలి.దోమ తెరలు వాడలి లేదా దోమలను నివారించడానికి మస్కిటో రిపెల్లెంట్స్, కాయిల్స్ వంటి ఇతర పద్ధతులను పాటించాలి ఇల్లు, బాత్రూమ్, కిచెన్ వంటి ప్రాంతాలను ఎప్పుడూ శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి.

## తాగునీటి భద్రత .. ఏమాత్రం నిర్లక్ష్యం వద్దు!

ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రమైన తాగునీరు చాలా ముఖ్యం, ముఖ్యంగా వర్షాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువ. అందుకే తప్పనిసరిగా నీటిని బాగా మరిగించి, చల్లార్చి, వడపోసి త్రాగలి ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా గాజు బాటిళ్లను ఉపయోగించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వల్ల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా మంచిది.బయట వెళ్ళినప్పుడు సొంత నీటి బాటిల్‌ను తీసుకెళ్లడం శ్రేయస్కరం.

## చెత్త నిర్వహణ ,మనందరి సామాజిక బాధ్యత!

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధుల బారి నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చేసి, మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ వాహనాలలోనే వేయలి

మనం నివసిస్తున్న పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి. ఇది దోమలు, ఇతర కీటకాల వ్యాప్తిని నివారిస్తుంది మరియు అంటువ్యాధులు ప్రబలకుండా అడ్డుకుంటుంది.సమాజంలో చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి మరియు భాగస్వామ్యం చేయాలి.

## ఆరోగ్య బీమా ,నేటి అవసరం, రేపటి ఆర్థిక భరోసా!


ప్రస్తుత కాలంలో వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. సాధారణ జ్వరం వచ్చినా వేలల్లో ఖర్చు అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి.ప్రభుత్వ, ప్రైవేట్ బీమా కంపెనీలు వివిధ రకాల ఆరోగ్య బీమా సేవలను ప్రజలకు అందిస్తున్నాయి. ఆర్థిక స్థోమతకు సరిపోయే ఉత్తమ బీమా పాలసీని ఎంచుకోని ఆరోగ్య బీమా అనేది అనారోగ్యం వచ్చినప్పుడు ఆర్థికంగా అండగా నిలుస్తుంది. పెద్ద ఆసుపత్రుల్లో కూడా బీమా ఉంటే ఎటువంటి చింత లేకుండా ఉత్తమ చికిత్సను పొంద వ చ్చు. ఆ ర్థిక స్థోమతకు తగ్గట్టుగా ఆరోగ్య బీమా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే అనారోగ్య ఖర్చుల నుండి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు గట్టిగా సూచిస్తున్నారు.



# రోడ్డుకు మోక్షం ఎప్పుడో?




**అందోల్ జులై 7 (సిరి న్యూస్)** అందోల్ మండల్ సంగుపేట మీదుగా పోతిరెడ్డిపల్లి, ఇటిక్యాల, కోడేకల్ , బస్వాపూర్ ,గ్రామాలకు వెళ్లాలంటే అక్కడ ఉన్న రోడ్డు చాలా కంకర గుంతలతో ఉంది. ప్రజలు రోడ్డు మీదనుండి గర్భిణీ స్త్రీలు జోగిపేట కీ హాస్పటల్ కి ఈ రోడ్డు వెంట వెళ్లాలన్న భయ ఆందోళనకు గురవుతున్నారు .అంతేకాకుండా తమ సొంత గ్రామాలకు రావాలన్న , పోవాలన్న భయపడుకుంటూ వెళ్తున్నా రు. సంగుపేట మొదలుకొని పుల్కల్ వరకు రోడ్డు ఎక్కడ చూసినా కంకర ,గుంతలు, దుమ్ము ధూళి పక్క ఊర్లకు పోయే ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ రోడ్డు బాగు చేసేది ఎప్పుడు అని అక్కడ ఉన్న ప్రజలు ఆందోళన గురవుతున్నారు, చుట్టుపక్కల ఉన్న గ్రామాలు నుండి ఎమ్మెస్ కంపెనీలోకి చాలామంది కార్మికులు తమ విధులకు పోతుండగా ఆటోలలో, ద్విచక్ర వాహనాలలో పోతున్నప్పుడు వాళ్లకు నడుము నొప్పులు కాళ్ల నొప్పులు వంటి వస్తున్నాయని చాలా బాధపడుతున్నారు.చుట్టుపక్కల పని లేక ఇటిక్యాల గ్రామం దగ్గర ఉన్న ఎమ్మెస్ కంపెనీలోకి పనికి వస్తున్నామని ప్రజలు అంటు న్నారు .ఎందుకంటే ఈ ఎమ్మెస్ కంపెనీకి వచ్చేట ప్పుడు తిరిగి కంపెనీ నుండి పోయేటప్పుడు మాకు ఈ రోడ్డు వల్ల నడుము నొప్పులు కీళ్ల నొప్పులు చాలా బాధాకరంగా రాత్రిలో నిద్ర పట్టని రీతిలో ఉన్నాయని వాళ్ళు అంటున్నారు.ఇక్కడ ఇటిక్యాల గ్రామ సర్పంచ్ కానీ ఎవ్వరు కూడా ఈ రోడ్డును పట్టించు కునే నాధుడే లేదని ఆ కంపెనీకి వెళ్లే కార్మికులు వాళ్లందరూ చాలా బాధపడుతున్నారు. ఎందుకంటే ఎక్కడ పడిపోతామో అనే భయంతో ప్రతిరోజు ఆందో ళన గురవుతున్నారు అంతేకాకుండా వారం రోజులు కంపెనీలోకి వీధులకు పోతే రెండు వారాలు కాళ్లు నొప్పులు నడుము నొప్పులతో బాధపడుతున్నామని వాళ్ళ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ రోడ్డు వల్ల ఈ కీళ్ల నొప్పులు నడుము నొప్పులు మాకు చాలా బాధిస్తున్నాయని మేము ఇక్కడ మేము పని చేసేది మా కుటుంబ పోషణ కోసం అనుకుంటే నెలసరి జీతం వచ్చేసరికి హాస్పిటల్ లకే మా డబ్బులు ఖర్చు అవుతున్నాయని వాళ్ళు బాధపడుతున్నారు. రోడ్డు వల్ల ఎమ్మెస్ కంపెనీలో చేయాలంటే భయ ఆందోళనకు గురవుతున్నామని ఎమ్మెస్ కంపెనీలో చేసే కార్మికులు కానీ సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు వాళ్ల బాధలు వ్యక్తపరుస్తున్నారు పై అధికారులు ఈ రోడ్డు దృష్టిలో పెట్టుకొని త్వరగా రోడ్డు వేయాలని కంపెనీ కార్మికులు అక్కడ గ్రామ ప్రజలు తమ ధీమా వ్యక్తం చేస్తున్నారు







# అడ్డదారిలో అవంతిక!



సర్‌ప్లస్ ఛానల్స్‌ను చెరబట్టిన అవంతిక...


## సాగునీటి వనరులపై అక్రమార్కుల కన్ను..


- అమీన్‌పూర్ లో సహజసిద్ధ వరద కాల్వలను ఆక్రమించిన నిర్మాణ సంస్థ
- భారీ కాల్వను.. చిన్న కాల్వగా మార్పు
- సర్‌ప్లస్ ఛానల్స్ స్వరూపం మార్చి ఫీల్డ్ ఛానల్‌గా మార్చిన వైనం
- మ్యాపులు మార్చి.. కబ్జా చేసిన కాల్వలపైనే నిర్మాణాలు
- కాల్వల ఉనికిని కాలరాస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- భవిష్యత్ వరదలకు బాధ్యులెవరు ?

(రామచంద్రాపురం-సిరిన్యూస్) అదొక బడా నిర్మాణ సంస్థ.. వందల కోట్లతో బహుళ అంతస్తు నిర్మాణాలను చేపట్టి అప్పుడే అమ్మకాలు ప్రారంభించింది.. డబ్బు, పలుకుబడి ఉంటే చాలు నిబంధనలను తొక్కిపెట్టి ఏదైనా చేయవచ్చనే ఆలోచనతో వ్యాపారం ప్రారంభించిన సంస్థ.. వరద కాల్వలను సైతం ఆక్రమించి, వాటిని దారి మళ్లించి అక్రమాలను సక్రమాలుగా చిత్రీకరించే ప్రయత్నానికి అంకురార్పన చేసిన సంస్థ.. అదే అమీన్‌పూర్‌లోని అవంతిక. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీకి కూత వేటు దూరంలో ఉన్న ఈ సంస్థ చేసే దారుణాలు అంతా ఇంతా కాదు. వేల సంఖ్యలో అపార్డ్‌మెంట్ ఫ్లాట్లను నిర్మిస్తున్న సదరు సంస్థ ప్రాజెక్టుకు అనుకూలంగా వరద కాల్వలను మారుస్తూ భారీ అక్రమాలకు పాల్పడుతోంది. ఈ తతంగం గత రెండేళ్లుగా జరుగుతున్నా ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు మాత్రం మౌనవ్రతం పాటించడం వెనక మతలబు ఏంటని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారులంతా అవంతికకే వత్తాసు పలుకుతున్నారనే అరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు సైతం ఈ విషయంలో పట్టిపట్టనట్లు వ్యవహరించడం వెనక అసలు కథేంటోనని గుసగుసలాడుతున్నారు.

### సర్‌ప్లస్ ఛానల్స్‌ను చెరబట్టిన అవంతిక...

అమీన్‌పూర్ పట్టణ పరిధిలోని బంధం కొమ్ము చెరువు కింది భాగంలో సర్వే నంబర్ 465, 467 నుండి 470 వరకు, 474 నుండి 477 వరకు, 532, 535, 536 లలో అవంతిక ప్రైడ్ వాల్స్ పేరుతో నిర్మాణాలను చేపట్టింది. అయితే ఈ ప్రాజెక్టు మధ్య నుండి ఓ వరద కాల్వ వెళ్తోంది. దీంతో అవంతిక ప్రైడ్ వాల్స్ సంస్థ ఆ సహజ సిద్ధ వరద కాల్వను అక్రమంగా మళ్లించి తమ ప్రాజెక్టుకు అనుకూలంగా మార్చి వేసింది. రెండు పెద్ద సర్‌ప్లస్ ఛానల్స్ కాల్వలను చెరబట్టి ఓ చిన్న ఫీల్డ్ ఛానల్ కాల్వగా మార్చినట్లు ఆధారాలు స్పష్టమవుతున్నాయి. ఈ పాత కాల్వల మ్యాపులు అమీన్‌పూర్ విలేజ్ రికార్డుల్లో ఉండగా సదరు సంస్థ తమ పరపతితో రికార్డులను తారు మారు చేస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అసలు నిబంధనల ప్రకారం అంత పెద్ద మత్తడి వరద కాల్వలను మార్చి చిన్న కాల్వగా కుదించే వీలు లేదని తెలుసుకున్న ఆ సంస్థ చిన్న కాల్వను చూపిస్తూ అధికారులను సైతం తప్పు దోవ పట్టిస్తున్నారు. కాల్వల స్వరూపాలను పూర్తిగా మార్చివేసి తమ వ్యాపారం కోసం అవకతవకలకు పాల్పడుతున్న అవంతికపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ఎవ్వరికీ అంతు చిక్కని ప్రశ్న. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు అసలు అమీన్‌పూర్‌లో పని చేస్తున్నాయా అని ప్రతి ఒక్కరికీ సందేహం కలుగుతుంది.



### చెరబట్టిన కాల్వపైనే భారీ నిర్మాణాలు

అవంతిక సంస్థ చెరబట్టి, దారి మళ్లించిన కాల్వలపైనే భారీ నిర్మాణాలను చేపట్టింది. పై నుండి వరదలు ఎక్కువైనప్పుడు ఆదుకునే సర్‌ప్లస్ కాల్వలను కుదించి వాటిని వరి పొలాలకు వెళ్లే చిన్నపాటి కాల్వలుగా దారి మళ్లించిన అవంతిక అన్ని శాఖల అధికారులను మభ్యపెట్టి దర్జాగా నిర్మాణాలు కొనసాగిస్తోంది. పక్కకు తిప్పిన చిన్న కాల్వను సైతం వదలకుండా తమ నిర్మాణ సంస్థకు చెందిన సేల్స్ ఆఫీస్‌ను పెట్టి నిబంధనలకు నీళ్లు వదులుతోంది. ఇరిగేషన్ ఎన్‌వోసీలు ఉన్నాయని ప్రచారం చేసుకుంటున్న సదరు సంస్థ ఆ పత్రాలను ఏ నిబంధనల ప్రకారం సంపాదించిందో, ఏ కాల్వలను చూపి ఎన్‌వోసీలు తెచ్చిందో ఎక్కడా బహిర్గతం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విలేజ్ మ్యాప్‌లో సర్వే నంబర్ 467, 470, 468 ల గుండా సర్‌ప్లస్ కాల్వ వెళ్తున్నట్లు రికార్డులున్నా దానిని ఒకే కాల్వగా మార్చి అది కూడా ఫీల్డ్ కెనాల్‌గా చూపించే ప్రయత్నం చేయడం వెకక ఎంతమంది అధికారుల హస్తముందో తెలియాల్సి ఉంది.

### వరదలొస్తే పరిస్థితి ఏమిటీ ?

సహజ సిద్ధంగా ఉన్న వరద కాల్వలను కుదించి, దారి మళ్లించిన అవంతిక నిర్మాణ సంస్థ ఒక్క విషయానికి మాత్రం భవిష్యత్ తరాలకు సమాధానం చెప్పాల్సిందే. ముందుముందు పై చెరువులన్నీ నిండి వరదలు వస్తే ఆ వరద నీరంతా ఎక్కడికి పోతాయనే ప్రశ్న అన్ని వర్గాల నుండి వ్యక్తమవుతోంది. వరద ప్రళయం ఎంతటి అనర్థం కలిగిస్తుందో పలు సంఘటనలు చూస్తున్నా అవంతిక అక్రమాలను ఎందుకు అడ్డుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వర్షాలు ఎక్కువగా కురిస్తే వరద కాల్వలు లేక అమీన్‌పూర్ అతలాకుతలం కాక తప్పదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బహిరంగంగా బరితెగించి మరీ కాల్వలను దారి మళ్లిస్తున్నా, కాల్వలను కుదిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం చెందుతున్నారు. అవంతిక చేసిన పాపానికి భవిష్యత్తులో అమీన్‌పూర్ మునిగిపోయే ప్రమాదం కనిపిస్తోందని, ఇప్పటికైనా అవంతిక అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# యాజమాన్య నిర్లక్ష్యమే కారణం

- సిగాచి పరిశ్రమను సందర్శించిన ఎన్డిఎంఏ బృందం
- పరిశ్రమ నిర్వహణలో లోపాలు
- ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన కేంద్ర బృందం

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 8 (సిరి న్యూస్):** భారీ ప్రమాదం జరిగిన పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా కంపెనీ ని మంగళవారం జాతీయ విపత్తు నివారణ సంస్థ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డిఎంఏ కేంద్ర బృందం కమిటీ సభ్యులు, సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరగడానికి గల కారణాలపై నిశితంగా అధ్యయనం చేశారు. పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదానికి గల కారణాలు అధ్యయనం చేయడంతో పాటు ఇలాంటి సంఘటనలు పరిశ్రమలలో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహణ సంస్థ కమిటీ సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంఘటన జరిగిన తీరును బృందం సభ్యులకు వివరించారు. ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టిన సహాయక చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, పరిశ్రమల శాఖ, అగ్ని మాపక శాఖ, కార్మిక శాఖ, పోలీసు,రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.

### 44కి చేరిన మృతుల సంఖ్య

**పటాన్ చెర్, జులై 8 (సిరి న్యూస్) :** సిగాచి పరిశ్రమలో గత నెల 30వ తేదీ జరిగిన పేలుడులో ఈరోజు ఇంకో ఇద్దరు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరణించారు. దీంతో మృతుల సంఖ్య 44 కి చేరింది. బీరంగూడ పనేషియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరిఫ్ అనే కార్మికుడు మృతి చెందగా, పటాన్ చెరు ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అఖిలేష్ అనే కార్మికుడి మృతి చెందారు. దీంతో ఇప్పటివరకు ధృవ ఆస్పత్రిలో నలుగురు కార్మికులు మృతి చెందారు. ఇదిలా ఉంటే ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 16 మంది కార్మికులు పరిస్థితి కూడా విషమంగానే ఉందని తెలుస్తోంది.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- విద్యా బోధన, వసతి, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 8 (సిరి న్యూస్) :** సంగారెడ్డి జిల్లా, కంది మండలం లోని మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల వసతులు, ఆహార నాణ్యత, పరిశుభ్రత, విద్య బోధన వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ముందుగా కలెక్టర్ హాస్టల్ గదులనుపరిశీలించారు. మెనూ బోర్డు ప్రదర్శనను తిలకించారు. అనంతరం కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ను పరిశీలించారు. ఆ సమయంలో వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి ముచ్చటించారు. డైనింగ్ టేబుల్ వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులను ఆప్యాయంగా పలకరించిన కలెక్టర్ ఆహారం రుచి ఎలా ఉంది? సమయానికి భోజనం అందుతుందా? మేను ప్రకారం భోజనం అందిస్తున్నారా వంటి ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తర్వాత తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. అందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలు అవసరాలపై కూడా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు అవసరమైన బోధన ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆరోగ్యపరంగా విద్యార్థులపై తగిన శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గురుకుల ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని అన్నారు. గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమేనని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీసంక్షేమ అధికారి దేవుజ, గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.



# ప్రధానమంత్రి జన్ దన్ యోజన అకౌంట్లు తెరవాలి

- పీఎంజేజేబీవై, ఏపీవై, సీఎంఎస్బివై పథకాలలో ప్రజలు చేరేలా చూడాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 8 (సిరి న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్ ధన్ యోజన అకౌంట్లు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన పథకాలపై విస్తృతస్థాయి ప్రచారాలు నిర్వహించాలని ఈ పథకాలలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు చేరేలాగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా బ్యాంకర్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సూచించారు. అదనపు కలెక్టర్ అధ్యక్షతన డిసిసి సమావేశం మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జరిగింది. ఈసందర్భంగా అదనపు కలెక్టర్



మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం వారి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్ ధన్ యోజన అకౌంట్లు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఇందుకోసం జిల్లాలోని అన్ని పంచాయతీలు కవర్ చేసే విధంగా బ్యాంకర్స్ కు కేటాయించారు. మూడు నెలల కాలంలో ప్రభువు ఈ ప్రభుత్వ పథకాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి అత్యధిక సంఖ్యలో ఈ పథకాలలో ప్రజలు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు . ఈ సందర్భంగా ఎల్డీఎం నర్సింగరావు మాట్లాడుతూ జిల్లాలో మూడునెలల పాటు 647 గ్రామ పంచాయతీలు కవరయ్యే ఆయా ప్రాంత సర్వీస్ బ్యాంకులకు కేటాయించి అత్యధిక సంఖ్యలో జీరో బ్యాలెన్స్ అకౌంట్లు తెరిచే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామాచారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, పిడి మెప్మా గీత, ఎల్ డి ఎం నర్సింగరావు, నాబార్డ్ అధికారులు, జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కుంట భూమికి.. హద్దులు ఏర్పాటు

## బోర్డు పాతిన అధికారులు సిరి కథనానికి స్పందన




**నార్సింగి, జులై 7 (సిరి న్యూస్):** ఈ నెల 4 న "కుంట భూమి కబ్జా" శీర్షికన వచ్చిన వార్తకు అధికార యంత్రాంగం స్పందించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ షేక్ కరీం, ఇరిగేషన్ ఏఈ లు సాయి కిరణ్, ప్రదీప్ ల ఆధ్వర్యంలో కబ్జా కు గురైన బర్రెంకల కుంట లో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ షేక్ కరీం మాట్లాడుతూ నార్సింగి లోని సర్వే నంబరు 624 లో గల బర్రెంకల కుంట పూర్తి విస్తీర్ణం రికార్డులో 5.14 ఎకరాలు ఉందని తెలిపారు. కుంట ను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నించిన విషయం పత్రికల ద్వారా తెలిసి సర్వే నిర్వహించగా, సుమారు రెండు ఎకరాల భూమి కబ్జా కు గురి అయినట్లు తేలిందని అన్నారు. మంగళవారం ఇరిగేషన్ అధికారుల తో పాటు కబ్జాకు గురి అయిన కుంట హద్దుల ను ఏర్పాటు చేసి, కబ్జా చేసిన వారికి స్థలాన్ని వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించామని తెలిపారు. కుంట లో బోర్డును ఏర్పాటు చేశామని, ప్రభుత్వ భూములను, కుంటలను, చెరువులను, కబ్జా చేసినా, కబ్జా కు ప్రయత్నించినా, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని వారి పై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ షేక్ కరీం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, సర్వేయర్ శ్రీకాంత్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





కుంట భూమి కబ్జా!
రాత్రికిరాత్రే చదును పొలంగా మార్పు

- ఇష్టారాజ్యంగా చెత్త డంపింగ్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతాంగం

# చెరువులో చెత్త ఎవరిది?

**వెల్దుర్తి జులై 8 (సిరి న్యూస్):** గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలలో వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ నుండి వేరు చేసి ఏర్పాటు చేసిన నూతన పంచాయతీ ఆరెగూడెం గ్రామపంచాయతీ, వెల్దుర్తి ఉమ్మడి పంచాయతీ ఉన్నప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగిన మేజర్ పంచాయతీ కానీ, నూతన పంచాయతీగా ఏర్పడిన తరువాత రెండు గ్రామ పంచాయతీల మధ్యలో ఉన్న పిన్ చెరువు, వెల్దుర్తి నుండి మెదక్ పోయే రోడ్డు పక్కనే ఉండడం ఆ చెరువు చేసుకున్న పాపమే కావచ్చు, ఎందుకంటే వెల్దుర్తి గ్రామ శివారు చివరన, ఆరెగూడెం గ్రామ పరిధి ప్రారంభంలో ఉండడమే పిను చెరువుకు పెద్ద శాపం. ఎందుకంటే అట్టి చెరువులో చెత్తాచెదారంతో నిండిపోవడం. దాని పక్కనే ఇరుపక్కల దుకాణ సముదాయాలు ఉన్నాయి. రోజుకు రోజుకు చెరువులో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన మరియు దోమలు ఈగలు అనేకం వస్తున్నాయని, పక్కన దుకాణ సముదాయాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా నిత్యం పొలం పనులకు వెళ్లే రైతులకు కూడా తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉండడంతో ఎంతోమంది అధికారులు దాని చూస్తూ పోతున్న పట్టించుకోకపోవడం గమనార్వం. ఈ విషయాన్ని ఇరు గ్రామపంచాయతీ అధికారులను వివరణ కోరగా పరిధి మాది కాదంటూ చెరువులోని చెత్తను రోజురోజుకు పేరుకుపోయే విధంగా ప్రవర్తిస్తున్నారు. ఇట్టి విషయమును ఇరిగేషన్ ఏఈ శ్రీకాంతు ను కూడా వివరణ కోరగా గతంలో కూడా మేము పంచాయతీ అధికారులకు చెప్పామని కానీ వారు చెరువులో చెత్త పడేయకుండా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. రోడ్డు పక్కనే ఉండడంతో వాహనదారులకు అలాగే గ్రామస్తులకు కూడా తీవ్రమైన దుర్వాసన వస్తుందని ఇట్లనే చెత్తాచెదారంతో ఉంటే పంట పండించే రైతులకు కూడా చాలా ఇబ్బందులు ఎదురవుతాయని గ్రామస్తులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెరువులో పేరుకుపోతున్న చెత్త చెదాలను తీసివేయాలని గ్రామస్తులు కోరుచున్నారు.





# మట్టి పోయించారు!

## సిరి కథనానికి స్పందించిన అధికారులు
## మురదమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు

**గుమ్మడిదల జులై 8 సిరి న్యూస్:** గ్రామాల్లో పెరుగుతున్న దోమలదండు అనే కథనం సిరి దినపత్రికలో ప్రచురించడం జరిగింది. అందుకు మున్సిపల్ అధికారులు స్పందించి గుమ్మడిదల గ్రామంలో సిసి రోడ్లపై నీరు నిలవడం మూలాన బురద మయంగా మారుతుందని అధికారుల దృష్టికి తీసుకురావడంతో స్పందించి మట్టి పోశారు. ప్రస్తుతం సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నామని మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు. త్వరలో శాశ్వత పరిష్కారం చేపడతామని తెలిపారు.



# రామాయంపేట స్టేడియం నిధులు ఏమయ్యాయి?



**రామయంపేట్ జూలై 8(సిరి న్యూస్)** రామాయంపేట పట్టణానికి తో పాటు మెదక్ నర్సాపూర్ గత ఎనిమిది సంవత్సరాల క్రితమే రెండు కోట్ల 62 లక్షల నిధులతో మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి మెదక్ ఇందిరా గాంధీ నిర్మించి దానినీ రాష్ట్రస్థాయి క్రీడలకు జాతీయ స్థాయి అనుకూలంగా క్రీడలకు నాయకులు కృషి చేశారు రామాయంపేట పట్టణంలో నేటి ఐదు ఎకరాల చదును చేసి స్టేడియం నిర్మించడానికి పనులు కూడా మొదలుపెట్టారు ఇందుకోసం గుట్టగా ఉన్న ఈ ప్రాంతాన్ని జెసిపిలతో మట్టిని తొవ్వడం ప్రారంభించి 50 లక్షల కాంట్రాక్టర్ కు సహకరించకపోవడంతో సదర్ కాంట్రాక్టర్ పనిని వదిలేసి నా డబ్బులు నాకు ఇవ్వండి అని ఇచ్చిన కాడికి తీసుకొని వెళ్ళిపోయాడు ఆరు సంవత్సరాలుగా ఆ స్థలం స్టేడియం స్థలంగా నిలిచి పోవడం ఎన్నోసార్లు క్రీడల సంఘ తరపున వార్తలు ఎమ్మెల్యే నాయకులు వచ్చినప్పుడు కూడా ప్రస్తావించడం జరిగింది గత ఎమ్మెల్యేపనులు కొనసాగిద్దామని చెప్పడం పోవడం కూడా జరిగింది ప్రభుత్వం మారిన తర్వాత ఎమ్మెల్యేకు స్థానిక నాయకులకు కూడా విజ్ఞాపన పత్రాలు కానీ ఏమాత్రం సమాధానం రాకపోవడంతో ఎప్పటికైనా అయితుందని ఆశతో ఉన్న క్రీడా సంఘాలకు ఐదు ఎకరాల భూమిని ఇంటిగ్రేటెడ్ ఇవ్వడం జరిగింది మంచి పరిణామమే ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం స్టేడియం స్థలం త్యాగం అయినా పర్వాలేదు కనీసం నిధులు ఉన్నాయా లేవా అని మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిని ప్రశ్నించగా నిధులు స్టేడియం వెనుకకు వెళ్ళిపోయింది అని తెలిపారు సరే మరునాడు ఇదే విషయం అధికార నాయకులను అడగగా నిధులు వచ్చినయా లేవా తెలవదు హాయంలో వెనక్కి వెళ్లాలని తెలిపారు ఇదంతా కూడా రెండు పార్టీల నాయకులకు క్రీడలపై చిత్తశుద్ధిగాని అంకితభావం లేదని తెలుస్తున్నది, రెండు కోట్ల 62 లక్షల రూపాయలు మంజూరై వాపస్ పోవడం శోచనీయమైన విషయమని క్రీడా సంఘాల ఆరోపిస్తున్నాయి ప్రభుత్వము ప్రకటిస్తేనే నిధులు అధికారికంగా ప్రకటించబడతాయి 50 లక్షల రూపాయలు స్టేడియం పనులు ఎలా కొనసాగాయి ఈ రూపాయలు ఎక్కడి నుండి కాంట్రాక్టర్కు అందజేశారు ఎవరి ఇంటి నుండి ఇచ్చేవి కావు కదా స్టేడియం ఇవ్వాల్సి ఉంటుంది నిధులు మంజూరు కానిది టెండర్ కాంట్రాక్టర్ ఎలా పనులు చేస్తాడు నిర్లక్ష్య వైఖరితో నాయకులు ఆడుతున్న నాటకమని ఏదిఏమైనా రామాయంపేటలో క్రీడలు ముందుకు పోవద్దని స్టేడియం ఊసేతితే ఆ స్థలం ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ఇచ్చాం కాబట్టి అన్న అడిగితే వారిపై పాఠశాల వద్దంటున్నారు అన్న అపవాది వేస్తున్నారు కూడా వీళ్లకు చిత్తశుద్ధి ఉంటే వేరే స్థలంలో వెంటనే వచ్చిన నిధులు వాడి స్టేడియం నిర్మించాలని క్రీడా సంఘాలు కోరుతున్నాయి కాకపోతే ఎమ్మెల్యే తో పాటు క్రీడల మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి నూతన స్టేడియం నిర్మించాలని క్రీడల సంఘాలు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయి




# మురుగునీటి సమస్య

కోహిర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణ ముందు మురికి నీటి కాలువ దుర్గంధం వలన సిబ్బంది, ప్రజలు కార్యాలయానికి వచ్చి పోయేవారు ఇబ్బంది పడుతున్నారు. మండల ప్రజా పరిషత్ అధికారులు మునిసిపల్ అధికారులకు సమస్యను విన్నవించిన పట్టించుకోవడంలేదని తెలియజేశారు. వర్షాలు అతిగా కురిస్తే మురికి నీటి ప్రవాహం ఎక్కువ అవడం వల్ల అక్కడికి చేరుకున్న మురుగునీరు నిల్వ ఉండడం వలన సిబ్బందికి, ప్రజలకు, చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

- కోహిర్, (సిరి న్యూస్)



# రామాయంపేటపై పట్టింపేది

- అధ్వాన స్థితికి చేరుకున్న 10వ వార్డు
- ముందుకు సాగని రోడ్లు
- మంచినీటి కటకట
- కాల్వల్లో నలిచిన మురుగునీరు
- ప్రజల పాలిట శాపంగా మారిన మున్సిపల్ సభ్యుల తీరు
- కష్టాలు తీరేదెన్నడు.. ప్రజల బతుకులు సక్కగయ్యేదెన్నుడు
- ఇప్పటికైనా రామాయంపేటపై శీతకన్ను వీడేనా
- సంబంధిత శాఖ పట్టించుకుని సమస్యలను గట్టెక్కించేనా..!



**రామాయంపేట జూలై 8 (సిరి న్యూస్) :** రామాయంపేట మున్సిపల్ పరిధిలోని అధికార మున్సిపల్ వార్డు సభ్యులు మున్సిపల్ చైర్మన్ ఉన్న నుండి కూడా ఇప్పటివరకు సౌకర్యాలు కలగలేదని వార్డు ప్రజలు వాపోతున్నారు. గత ఐదేళ్లుగా మున్సిపల్ సభ్యులు పనులు కొనసాగించలేదని వార్డు ప్రజలు అంటున్నారు. వార్డుల్లో సీసీ రోడ్లు వేయిస్తామని మంచినీటినీ అందిస్తామని చెప్పిన కార్యవర్గ సభ్యులు శ్రద్ధ చూపలేదని వార్డులో రోడ్లు, గుంతలు ద్విచక్ర వాహనాలు నడవలేని పరిస్థితిలో ఉన్నాయని అంటున్నారు. మురుగు కాల్వల నిర్మాణం పాత మురుగుకాలువ లను నీరు బయటకు వెళ్లకుండా ఎక్కడికక్కడే స్తంభించిపోతున్నదని దీనివల్ల దుర్వాసనతో పాటు దోమలు క్రిమి కీటకాల రోగాలు శోక వచ్చని వారు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు అంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనీ ప్రజలు కోరుతున్నారు.





# ఆధునిక పద్దతిలోనే వ్యవసాయ సాగు మేలు



- రైతుకు వ్యవసాయ అధికారుల సన్మానం

**నార్సింగి, జులై 8 (సిరి న్యూస్) :** వ్యవసాయం లో రోజు రోజుకు పెట్టుబడులు పెరిగి రైతులకు లాభాలు తగ్గిపోతున్నాయి. దానికితోడు కూలీల కొరత కూడా విపరీతంగా వేధిస్తోంది. ప్రస్తుత కాలంలో ఎకరా పొలంలో వరి పండించాలంటే రైతులకు వచ్చే లాభం కన్నా పెట్టుబడే అధికంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు వరి పండించాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టింది. అనేక రకాల రైతు సంక్షేమ పథకాలను తీసుకుని వచ్చి రైతులకు ప్రోత్సహించింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు నిత్యం అధ్యయనాలు చేసి, నూతన శాస్త్రీయ పద్ధతులను ప్రవేశ పెట్టి తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహిస్తూ వచ్చింది. అందులో భాగంగానే డ్రమ్ సీడర్ విధానంలో విత్తనాలను నాటడం. డ్రమ్ సీడర్ విధానం ద్వారా విత్తితే ఎకరాకు 8-10 కిలోల విత్తనాలు సరిపోతాయి. అదే మామూలు పద్ధతిలో అయితే 30 కిలోల విత్తనం అవసరమవడం తో పాటు, ఈ పద్ధతి ద్వారా సమయం కూడా ఆదా అవుతుంది. అంతే కాకుండా గింజ గింజ కు మధ్య దూరం పెరగడం వల్ల రోగాలు తెగుళ్లు రాకుండా, దోమపోటు కూడా రాకుండా నివారించవచ్చు. డ్రమ్ సీడర్ ద్వారానే విత్తుకునేలా రైతులను ప్రోత్సహించి వారికి అవగాహన కలిపిస్తూ వచ్చారు. మంగళవారం నార్సింగి గ్రామంలో డ్రమ్ సీడర్ విధానంలో వ్యవసాయం చేసిన గుర్రాల స్వామి కి వ్యవసాయ అధికారులు సన్మానం చేశారు. రైతులు పెట్టుబడి తగ్గించుకుని, అధిక లాభాలు సాధించాలని మండల వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, విస్తరణ అధికారిని విజృంభణ, రైతులు స్వామి, దాయం యాదగిరి, సంద సిద్దయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల గుండెల్లో

# వైఎస్సార్ పదిలం

- వెల్దుర్తి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం చారి



**వెల్దుర్తి జులై 8 (సిరి న్యూస్ :** ప్రజల గుండెల్లో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎల్లప్పుడు పదిలంగా ఉంటారని వెల్దుర్తి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం చారి అన్నారు. మంగళవారం వెల్దుర్తి మండల కేంద్రంలో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు కార్యకర్తలు నాయకుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి మల్లేశం చారి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, జనహృదయ నాయకుడు డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమ కోసం పరితపించే వారిని కొనియాడారు. ఇప్పటికీ ఎప్పటికీ ప్రజలు వైఎస్ఆర్ ని మరువలేరని పేర్కొన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ప్రజాప్రయోజన పథకాలు కోట్లాది మందికి మేలు చేశాయనీ, ప్రతి నాయకుడు వైయస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కొత్త ముక్తాబాయి, పిఏసిఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్, నాయకులు శేఖర్ గౌడ్, జగ్గ శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబురాలు




**నార్సింగి, జులై 8 (సిరి న్యూస్):** మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నవనీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా శక్తి సంబరాల ప్రత్యేక అధికారి డీపీఎం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాల అభివృద్ధి కోసం ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ పంపులు, ఇందిరా మహిళా క్యాంటీన్ల నిర్వహణ తదితర కార్యక్రమాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందిస్తున్నామని అన్నారు. జులై 7 నుంచి 18 వరకు నిర్వహించే సంబరాల కార్యక్రమానికి ప్రతి మహిళ హాజరై మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించే విషయాలను తెలుసుకోవాలని కోరారు. శిల్పారామం వద్ద నైట్ బజార్ ద్వారా 106 దుకాణసముదాయాలలో మహిళా సంఘాల ద్వారా తయారుచేసిన వస్తువులను విక్రయించు కునేందుకు అద్దె లేకుండా దుకాణాలు ఇస్తున్నామని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పాఠశాలల ఏకరూప దుస్తులు కుట్టడం తో పాటు నాటు కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలు ఇస్తున్నామని అన్నారు. మండలంలో బ్యాంకు లింకేజ్ ద్వారా 16 కోట్ల 74 లక్షల రూపాయల రుణాలు ఇవ్వాల్సి ఉండగా మూడు నెలల్లో మూడు కోట్ల యాభై నాలుగు లక్షల రూపాయల రుణాలు ఇచ్చామని, స్త్రీ నిధి ద్వారా కోటి 84 లక్షల రూపాయల రుణాలు ఇవ్వాల్సి ఉండగా, మూడు నెలల లోనే 36 లక్షల రుణాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, కార్యదర్శి ప్రవల్లిక, కోశాధికారి నవనీత, సీసీ లు శంకర్, సుల్తానా, విఓఏ లు వివిధ గ్రామాల గ్రామ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే

# ఉన్నత లక్ష్యాలు సాధ్యం

- సీఐ రేణుక రెడ్డి



**అల్లాదుర్గం, జులై 8 (సిరి న్యూస్):** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని అల్లాదుర్గం సర్కిల్ సిఐ రేణుక రెడ్డి అన్నారు. అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో పదవ తరగతి ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ. విద్యార్థులు చిన్ననాటి నుండి మంచి క్రమశిక్షణతో మెలగాలని, చదువును కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని మంచి నడవడి ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కొంక రాజేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ తుకారం లు మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు సాధించడానికి ఉపకరిస్తుందని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులుకు ఉచితంగా వ్యక్తిత్వ శిక్షణ తరగతులు ఎంతో ప్రయోజనమని ఇలాంటి కార్యక్రమాల వల్ల ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఇంటర్నేషనల్ సంగారెడ్డి రీజనల్ ద్వారా నగదు పురస్కారంతోపాటు జ్ఞాపక, శాలువాతో విద్యార్థులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ రీజినల్ కార్యదర్శి నరసింహారెడ్డి, డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ కే నర్సింహులు, సర్వేస్ కోఆర్డినేటర్ దేవల్ల రమేష్, ఎంఈఓ ధనుంజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థి అదృశ్యం

**చేగుంట జులై 8 (సిరి న్యూస్) :** చేగుంట పట్టణానికి చెందిన షేక్ అసిఫ్ (16) విద్యార్థి 04/07/ 2025నాడు తనకు తన తల్లిదండ్రులు, స్మార్ట్ ఫోన్ ఇప్పించడం లేదని మనస్థాపం చెంది ఇంట్లో రాత్రి అందరు పడుకున్నాక అలిగి, ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయినాడు, వారి తల్లిదండ్రులు చుట్టుప్రక్కల, బంధువుల వద్ద,వెతికిన ఎలాంటి ఆచూకీ తెలియలేదు, అతని తండ్రి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై శ్రీ చైతన్య కుమార్ రెడ్డి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు,అతను ఇంట్లో నుండి వెళ్లినప్పుడు తెలుపు, గోధుమ రంగు షర్టు, నీలం రంగు పాయింటు ధరించినాడు అతను కొల ముఖం కలిగి నలుపు రంగు కలడు, ఎత్తు సుమారు నాలుగు ఫీట్లు కలడు, ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్లు గాని, చేగుంట పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.



# వైభవంగా రుక్మిణి విఠలేశ్వర కల్యాణోత్సవం





**పెద్దశంకరంపేట్ జులై 8 (సిరిన్యూస్) :** పెద్ద శంకరంపేట కేంద్రంలోని రుక్మిణి విఠలేశ్వర ఆలయంలో ఆషాడశుద్ధ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రుక్మిణి విఠలేశ్వర కళ్యాణం మహోత్సవంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద బ్రాహ్మణ మంత్రోచ్ఛరాణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన పూల పందిరిలో శ్రీ రుక్మిణి విఠలేశ్వర కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది ఈ కార్యక్రమంలో మండల లోని ఆయా గ్రామాల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు కళ్యాణ అనంతరం ఆలయ కమిటీ అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈనెల తొమ్మిదో తారీఖు స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం రథోత్సవం 10వ తేదీన గురు పౌర్ణమి నాడు సామూహిక కుంకుమార్చన సాయంత్రం గోపాల కాలువలు పల్లకి సేవ జరుపబడును కావున ప్రజలు అందరూ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆలయ కమిటీ తెలిపింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాయకులు మహిళ మణులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఆయిల్ ఫామ్ పంటసాగుతో అధిక దిగుబడి



**అల్లాదుర్గం, జులై 8 (సిరి న్యూస్) :** ఆయిల్ ఫామ్ పంటపై రైతులు ఆసక్తి కలవరిస్తున్నారని, ఈ పంట వల్ల రైతులకు అధిక దిగుబడి లాభాలు వచ్చే ఆస్కారం ఉందని లీవ్ ఫామ్ కంపెనీ టెక్నికల్ అడ్వైజర్ వైయస్ రంగనాయకులు తెలిపారు. అల్లాదుర్గం రైతు వేదికలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ పంట కోసం సబ్సిడీలు ఇస్తున్నాయని, సాగు చేసే ఎస్సీ ,ఎస్టీ లకు డ్రిప్ సిస్టం కోసం 100% సబ్సిడీ ఇస్తుందని, అలాగే బీసీ రైతుల కోసం 90%, ఇతర రైతుల కు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉండడం, 30 ఏళ్ల వరకు ఆదాయం లభించే ఆస్కారం ఉండడం, బైబ్యాక్ పద్ధతిలో కంపెనీ ఉత్పత్తి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంతో రైతులు ఈ పంట సాగు పై ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు వెయ్యి ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగులో ఉందని, ఆయా మండలాల్లో రైతులు పంట పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారని, ఈ పంట వల్ల అధిక లాభాలు వస్తాయని తెలిపారు, సాగు చేసిన నాలుగు ఏళ్ల నుండి పంట దిగుబడి ప్రారంభమవుతుందని 30 ఏళ్ల వరకు రైతులు లాభాలు పొందవచ్చు దీనిని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్, విస్తీర్ణ అధికారిలు నవీన్, అమృత్, రాజు, లీవ్ ఫామ్ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, ఉన్నారు.

# సైబర్ మోసాలపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం

● ఏఎస్ఐ గాలయ్య



**అల్లాదుర్గం జూలై 8 (సిరి న్యూస్):** సైబర్ మోసాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని సైబర్ నేరాలను రూపు మాపడమే లక్ష్యమని అల్లాదుర్గం ఏఎస్ఐ గాలయ్య అన్నారు.. మంగళవారం అల్లాదుర్గం ఐబి చౌరస్తా లో ప్రజలక సైబర్ నేరాల అవగాహన కల్పించారు. ఆటోల ద్వారా గ్రామాలకు వెళ్లే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేబుల్ ప్రసారాలు హోర్డింగ్ల ద్వారా సైబర్ నేరాలపై చైతన్యం తీసుకొస్తున్నామన్నారు ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన తీసుకురావడమే తమ లక్ష్యం అన్నారు ఈ సైబర్ నేరగాళ్లపై మండలంలోని అన్ని గ్రామాలలో టామ్ టామ్ ఆటోలు తిప్పి ఆడియో ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. లావాదేవీల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటామో ఆన్లైన్లో కూడా అంతకంటే జాగ్రత్తగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్ట్, ఫేక్ లోన్ యాప్స్, ఏపీకే ఫైల్ లింక్స్ ,షేర్ మార్కెట్ మోసాలు, కొరియర్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా వచ్చే వీడియో కాల్స్ ,ఆర్థిక నేరాలు ,తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఆయన కోరారు. సైబర్ నేరగాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , ప్రజలు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి సంబురాలు




**వెల్దుర్తి, జూలై 8 (సిరి న్యూస్) :** వెల్దుర్తి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మండల సమైక్య కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమస్త గత నిర్మాణం, ఆర్థిక చేకూర్పు, వ్యవసాయం జీవనోపాదులు, వ్యవసాయేతర జీవనోపాదులు. మైక్రో ఎంటర్ప్రైజెస్, జెండర్ మొదలైన అంశాలను చర్చించారు. మండల సమైక్య అధ్యక్షురాలు రూప, కార్యదర్శి సోనీ, కోశాధికారి భాగ్యరాణి. జెండర్ పాయింట్ పర్సన్ ముక్తా బాయ్, ఏపీఎం శంకరయ్య, సీసీలు సత్యం, యాదగిరి, శ్రీనివాస్, రజిత, గ్రామ సంఘాల అధ్యక్షులు, వివో ఏ లు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు యువ నాయకుడి ఆర్థిక సహాయం



**నార్సింగి, జులై 8 (సిరి న్యూస్) :** మండలం లోని శంకాపూర్ తండా లో నిరుపేద కుటుంబానికి చెందిన నేనావత్ ప్రవీణ్ హఠాత్మరణం చెందగా స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మహేందర్ సింగ్ అంత్యక్రియల సహాయార్థం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మృతిని కి భార్య ఒక కూతురు ఉందని, దాతలు, ప్రభుత్వం మృతుని కుటుంబానికి ఆదుకోవాలని మహేందర్ సింగ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్ ఆక్రమణతో పాదచారులకు ఇబ్బందులు



**నర్సాపూర్, జూలై 8 (సిరి న్యూస్) :** నర్సాపూర్ పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణ తో పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు జాతీయ రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి జాతీయ రహదారి పక్కన రక్షణ వలయాలు ఏర్పాటు చేసి పాద చారులకు ఫుట్ పాత్ నిర్మించారు కానీ షాప్ యజమానులు షాప్ ముందు ఉన్న ఫుట్ పాత్ స్థలములను చిరు వ్యాపారులకు కేటాయించి రోజు చొప్పున కొంత డబ్బులు తీసుకుంటున్నారు దీనితో ఫుట్ పాత్ పై విచ్చలవిడిగా చిరు వ్యాపారస్తులు తోపుడు బండ్లు ,పండ్ల వ్యాపారస్తులు తమ ఇస్టారీతిగా వ్యాపారం చేస్తున్నారు దీనితో పాదచారులు జాతీయ రహదారిపై నడవడంతో వాహనదారులకు ఇబ్బంది కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి ఒకానొక సమయంలో భారీ వాహనాలు అదుపుతప్పి డివైడర్ ను , ట్రాఫిక్ లైట్ నియంత్రణ స్తంభాన్ని ఢీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి కనుక మున్సిపల్ అధికారులు ఫుట్ పాత్ ఆక్రమణ జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరుకుంటున్నారు.





# బోధన.. మధ్యాహ్న భోజన విషయంలో అలసత్వం వద్దు

- జడ్పిహెచ్ఎస్‌ను ఆకస్మిక తనికి చేసిన కలెక్టర్
- పాఠశాల సిబ్బంది, అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

**సిద్దిపేట ప్రతినిధి, జూలై 8 (సిరి న్యూస్)** బోధన విషయంలో కానీ,విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన విషయంలో కానీ అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనికి చేశారు. బోజన పంపిణీ ప్రదేశంలో శుభ్రంగా లేదని, ఆలుగడ్డ కూర మాత్రమే వండారని,మెనూ ప్రకారం సాంబారు చెయ్యలేదని ప్రశ్నించగా ఈ ఒక్క రోజే ఇలా జరిగిందని..రోజు పాటిస్తున్నామని ప్రిన్సిపల్, వంట సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. డైనింగ్ హల్ ఉన్నా కూడా కిచెన్ షడ్ ముందు భాగంలో విద్యార్థులకు భోజనం సరఫరా చేయవద్దని.. డైనింగ్ హల్ లో భోజనం సరఫరా చెయ్యాలని.. తప్పనిసరిగా మెనూ పాటించాలని హెచ్చరించారు. అంతకుముందు మండల సమాఖ్య భవనం లో స్టీల్ బ్యాంక్ ను పరిశీలించారు. అనంతరం కోహెడ మండలంలోని పలు వాగులలో ఇందిరమ్మ ఇళ్ల కోసం టోకెన్ లు తీసుకుని అక్రమంగా ఇసుక వేరొక చోటికి మళ్లిస్తున్న ట్రాక్టర్ ను కలెక్టర్ గమనించగా అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని తహసిల్దార్ లను ఆదేశించారు. మండల పోలీస్ అధికారులు, తహసీల్దార్లు అక్రమ రవాణా చేస్తున్నా ఇసుకను అడ్డుకోవాలని అసలైన ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఇసుక అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## నూతన ఎస్సైలు బాధ్యతగా వ్యవహరించాలి



**సిద్దిపేట కలెక్టరేట్, జూలై 8 (సిరి న్యూస్)** : నూతన ఎస్ఐలు బాధ్యతగా, అంకితభావంతో పనిచేసి, మంచి పేరు తెచ్చుకోవాలని పోలీస్ కమిషనర్ అనురాధ కోరారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రొబిషనరీ ఎస్ఐలు నూతనంగా పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. సంబంధిత పోలీస్ స్టేషన్లలో పదవీ బాధ్యతలు స్వీకరించి..మర్యాదపూర్వకగా పోలీస్ కమిషనర్ అనురాధని కలసి వారు పుష్పగుచ్చాలు అందజేశారు. పోలీస్ కమిషనర్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలను అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం మొదటిసారి పోలీస్ స్టేషన్కు వెళ్లి ఎస్ఐలుగా పదవి బాధ్యతలు చేపట్టినందున ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మొదటి పోస్టింగ్ జీవితంలో ఎవ్వరు కూడా ఎప్పుడూ మరువలేరని,ఎక్కడికి వెళ్లినా మొదటి పోస్టింగ్ లో నిర్వహించిన విధులు జీవితాంతం గుర్తుంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ,అంకిత భావం, నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రజల రక్షణకు పెద్దపీట వేయాలని తెలిపారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సీసీ కెమెరాలు గ్రామస్తులు, వ్యాపారస్తులతో కలసి వెంటనే రిపేర్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు, ఎస్బి ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్,కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ మల్లేశం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

- విధులు సక్రమంగా నిర్వహించాలి
- పోలీస్ కమిషనర్ అనురాధ

**సిద్దిపేట టౌన్, జూలై 8 (సిరి న్యూస్)** ప్రజలకు, ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా నిధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అనురాధ కోరారు. సిద్దిపేట ట్రాఫిక్ నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన విజయ్ భాస్కర్ మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ అనురాధని కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సైను అభినందించారు. ప్రజలకు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ విధులు నిర్వహించాలని, వాహనదారులకు,ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించాలని సూచించారు.



# కామన్ డైట్ మెనూ పకడ్బందీగా అమలు చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



**దౌల్తాబాద్, జూలై 8 (సిరి న్యూస్)** :కామన్ డైట్ మెనూ పకడ్బందీగా అమలు చేయాలని సిద్దిపేట జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా అగర్వాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన బిఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని బిఎల్ఓ లకు పలు సూచనలు చేశారు.అనంతరం గోవిందాపూర్ లో వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. మండలంలో వన మహోత్సవంలో భాగంగా పూర్తి స్థాయిలో మొక్కలు నాటాలన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల ఆరా తీసి రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కామన్ డైట్ మెనూ పకడ్బందీగా చేయాలని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లింగస్వామి,ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, తహశీల్దార్ చంద్రశేఖర రావు, మండల విద్యాధికారి కనకరాజు, ఎంపీఓ గఫూర్ ఖాద్రి తదితరులున్నారు.

# పత్తి కలుపు నివారణలో జాగ్రత్తలు పాటించండి

ఏఓ కృష్ణ



**పెద్దశంకరంపేట జూలై 8 (సిరి న్యూస్)** : పేట, మండల పరిధిలోని మార్చేట్ పల్లి గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఏఓ కృష్ణ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పత్తి పంటను పరిశీలించారు ఏవో కృష్ణ రైతులతో మాట్లాడుతూ పత్తి పంటకు వ్యాపించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కలుపు నివారణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు.

## ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**దౌల్తాబాద్, జూలై 8 (సిరి న్యూస్)** :దౌల్తాబాద్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గంగధర అరుణ్ కుమార్ ను మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పడాల రాములు, ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బందరు లాలు, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి, ఆత్మ కమిటీ డైరెక్టర్ సూరంపల్లి ప్రవీణ్,నాయకులు పడాల మల్లేశం,లలిత కృష్ణ,ఎర్రయ్య,రైతన్న, బొల్లం యాదగిరి,బోర్రల స్వామి,సంభాగ సురేందర్, పంజా రమేష,లింగం,నరసింహారెడ్డి,డేవిడ్ తదితరులున్నారు.



# ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

- వనమహోత్సవంలో మొక్కలు నాటిన కలెక్టర్




**సిద్దిపేట ప్రతినిధి, జూలై 8 (సిరి న్యూస్) :** ప్రతి ఒక్క పౌరుడు విధిగా మొక్కలు నాటి, సంరక్షించాలని జిల్లా కలెక్టర్ హైమావతి పిలుపునిచ్చారు. చిన్న కోడూరు మండలంలోని చందులాపూర్ గ్రామంలో గల పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళా శాల ఆవరణలో వనమహోత్సవం కార్య క్రమం ద్వారా కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ పర్యావరణ పరిరక్షణకు దోహధపడే మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వనమహోత్సవం కార్య క్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రభు త్వం ఉచితంగా మొక్కలను అందిస్తుందని.. జిల్లాలోని ప్రతి ఒక్క పౌరుడు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. చందులాపూర్ గ్రా మంలో గల రంగనాయక సాగర్ పంప్ హౌస్ ను పరిశీలించారు. అండర్ టన్నె ల్ ద్వారా ప్రయాణించి పంప్ హౌస్ ని చేరుకోగా రంగనాయక సాగర్ డిఇ చంద్రశేఖర్ పంపు హౌస్ లోని అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ కు చూపించి.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయక సాగ ర్ రిజర్వాయర్,పంప్ హౌస్ వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. రిజర్వాయర్ లోకి వాటర్ పంపింగ్ స్థలాన్ని చూపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రంగనాయక సాగర్ గెస్ట్ హౌస్ ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, చిన్నకోడూరు తాసిల్దార్ సలీమ్ మియా, ఎంపీడీవో, పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్, మహిళలు పాల్గొన్నారు.



# చెత్తతో మూసుకుపోయిన మోరీ

- నాలుగు నెలలుగా పట్టించుకోని అధికార గణం
- ఆవేదన వెల్లబుచ్చిన స్థానికులు



**సిద్దిపేట ప్రతినిధి, జూలై 8 (సిరి న్యూస్)** గత నాలుగు నెలలుగా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో మోరిలో మట్టి, పిచ్చి మొక్కలతో పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వాసనతో దుర్గంధం వస్తుందని గత నాలుగు నెలలుగా మున్సిపల్ సిబ్బంది ఇటు వైపే రావడం లేదంటూ స్థానికులు తమ గోడు వెలిబుచ్చారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది అధికారులు మోరి నాళాలు శుభ్రం చేసి దుర్గంధం నుంచి తమకు విముక్తి కలిగించాలని, వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా ఊరిలో నీరు నిలిచి అనారోగ్యం సమస్యలు తలెత్తే అవకాశం ఉందని,వెంటనే అధికారులు స్పందించాలని కోరారు.

# కేటీఆర్ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతుండు

- మండల అధ్యక్షుడు పడాల రాములు




**దౌల్తాబాద్, జూలై 8 (సిరి న్యూస్) :**సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు పడాల రాములు మండిపడ్డారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరేంత స్థాయి కేటీఆర్ కు లేదని కాంగ్రెస్ పార్టీ సగటు సామాన్య కార్యకర్తలు కేటీఆర్ కు సమాధానం చెప్పడానికి రెడీగా ఉన్నారన్నారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్ర ఎన్ని రకాలుగా విధ్వాంసానికి గురిచేసి నేడు నీతులు వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కేటీఆర్ అధికార దాహంతో స్థాయికి మించి మాట్లాడుతున్నారని ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల్లో టిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయన్నారు.నీతులు వల్లించే కేటీఆర్ ముందుగా తమ పార్టీని సక్రమంగా నడిపించాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి,ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు, ఆత్మ కమిటీ డైరెక్టర్ సూరంపల్లి ప్రవీణ్, పడాల మల్లేశం,లలిత కృష్ణ,బొల్లం యాదగిరి, నరసింహారెడ్డి, కృష్ణ, సురేందర్, డేవిడ్ తదితరులున్నారు.

# పీఆర్‌టీయూ టీఎస్‌కు సంఘం నుండి సుంకరి కృష్ణ తొలగింపు

- పీఆర్‌టీయూ టీఎస్ సంఘానికి వ్యతిరేక చర్యలకు సరైన గుణపాఠం
- రాష్ట్ర శాఖ సాహసోపేత నిర్ణయానికి మెదక్ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతు

**మెదక్, జులై 8 (సిరి న్యూస్) :** కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పి ఆర్ టి యు టి ఎస్ సంఘ అభ్యర్థికి మద్దతు ఇవ్వకుండా విజయానికి ఏ మాత్రం కృషి చేయకుండా ఇతర అభ్యర్థులతో కుమ్మక్కై, డబ్బు ప్రలోభాలకు లొంగిపోయి పి ఆర్ టి యు టి ఎస్ సంఘ నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరించినందున గాను రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ నివేదిక మేరకు మెదక్ జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణను పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ సంఘం నుండి తొలగించడంతో పాటు ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తున్నట్టు రాష్ట్ర నాయకులు తెలిపారు సంఘానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించిన వారి పట్ల రాష్ట్ర శాఖ తీవ్రమైన చర్యలు తీసుకుంటాయని ఎంతటి వారైనా క్రమ శిక్షణ చర్యలు ఉల్లంఘిస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయని సంఘంలో ఉన్నంత పదవులు అనుభవించి సంఘానికి ద్రోహం చేసిన వారిని సంఘాన్ని నిర్వీర్యం చేయడానికి కుయుక్తులు పన్నిన వారిని, సంఘానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించిన వారి పట్ల చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎంతటి వారైనా క్రమ శిక్షణ ఉల్లంఘిస్తే కఠిన నిర్ణయాలు తప్పవనే సందేశాన్ని బలంగా అందించిన దశాబ్దాలుగా సంఘమునే నమ్ముకొని, సంఘ ఉన్నతే ధ్యేయంగా , విధేయులుగా పనిచేసిన అందరికీ రాష్ట్ర శాఖ తీసుకున్న సాహసోపేత నిర్ణయం పట్ల మెదక్ జిల్లా సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



**నారాయణఖేడ్, జూలై 8 (సిరి న్యూస్) :** నియోజకవర్గం సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్,గ్రామంలో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ఇల్లు లేని వారికి ఐదు లక్షల సాయంతో వారికి చేదోడు వాదోడుగా ఉంటూ వారి ఆశయాన్ని తీర్చడానికి ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలనీ ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనీ ప్రతి ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఈ సంవత్సరం నియోజకవర్గనీకి 3500 ఇండ్లను మంజూరు చేసిందని ఈ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా 1000 మంజురు అవుతాయని పేర్కొన్నారు. ఇల్లు రాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని తెలియజేశారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు తక్షణమే తమ ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణ దశలను బట్టి సకాలంలో బిల్లులు వచ్చేలా చూస్తాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల పంచాయతీ సెక్రటరీ మారుతీ మండలం ముఖ్య నాయకులు యాదవ్ రెడ్డి. నర్సా రెడ్డి మాజీ సర్పంచ్ లు .బల్ రెడ్డి.వెంకట్ రెడ్డి.జైవంత్. శంకర్ మాజీ సర్పంచ్ లు .అంతు పటేల్.గంగాధర్ మాస్టర్ .సుభాష్ రావ్. ఎసప్ప పిఎసిఎస్ డైరెక్టర్ .హన్మంత్ రావ్.బాబు .విఠల్ రెడ్డి. దివాకర్ రెడ్డి .మాణిక్ సంగ్రామ్ .అఫ్రోజ్. బస్వారాజ్ స్వామి . గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు గ్రామా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ భావన నిర్మాణనికి శంకుస్థాపన



**నారాయణఖేడ్, జులై 8 (సిరి న్యూస్) :** నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదురుగా. తహసిల్దార్ గ్రౌండ్ ఆవరణలోనీ గ్రంథాలయంలో నూతనంగా గ్రంథాలయ భవనము(మొదటి అంతస్తు) ప్రహరీ గోడ నిర్మాణం కొరకు 60లక్షల రూపాయలు మంజూరు అయిన సందర్భంగా మంగళవారం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ రియాజ్. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని గ్రంథాలయం ఏర్పాటు చేయడమే కాకుండా గ్రంథాలయంలో ప్రతి ఒక్క పుస్తకాన్ని చదువుకోడానికి వచ్చిన విద్యార్థుల కోసం కావలసిన వసతులు ఏర్పాటు చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలోనే నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 సంవత్సరాల వార్షికోత్సవాలలో భాగంగా ఎన్ ఈ ఈ టి కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని వారు అన్నారు .తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ ,నియమితులైన మొదటి రోజే వారి నివాసానికి వెళ్లి మొదటగా మా నారాయణఖే నియోజకవర్గ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని మా నియోజకవర్గానికి గ్రంథాలయం ఉంది కానీ దానిలో విద్యార్థులు ఎక్కువ మొత్తంలో చదువుకోడానికి వస్తున్న సందర్భంగా స్థలం అనుకూలంగా లేనందున మాకు దానిపై మొదటి అంతస్తును నిర్మించాలని వారిని అడగగానే మొట్టమొదటిగా తెలంగాణలోనే నారాయణఖేడ్ నియోజకవర్గానికి మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా రియాజ్ గారికి నారాయణఖేడ్ నియోజకవర్గా ప్రజల తరపున మరియు విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సంగారెడ్డి జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వసుంధర, నియోజకవర్గనికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





గురు పౌర్ణమి సందర్భంగా నారాయణఖేడ్ డిపో నుండి అరుణాచలగిరి ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సును డిపో మేనేజర్ మల్లేషయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నందులాల్ మార్కెటింగ్ సెల్ ఇంచార్జ్ పాండు, కంప్యూటర్ ఆపరేటర్ డేవిడ్. మోహన్ ప్రయాణికులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్ జూలై 8 (సిరి న్యూస్):**

# కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- నేటి కార్మిక సమ్మెను జయప్రదం చేయండి
- కార్మికుల సమ్మెతో మోడీ ప్రభుత్వానికి దిమ్మతిరగాలి
- ప్రచార జాతలో సీఐటీయూ రాష్ట్ర నేత రాజయ్య పిలుపు



**గుమ్మడిదల జులై 8 (సిరి న్యూస్) :** పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర నేత కే. రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిన్నారం, గుమ్మడిదల పారిశ్రామిక వాడలలో ప్రచార జాత నిర్వహించారు. ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం మూలాన కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. లేబర్ కోడ్ ని కూడా తక్షణమే రద్దు చేయాలన్నారు. అవినీతిని ఎరగట్టా అరికట్టాలని, రైతన్నకు గిట్టుబాటు ధరలకు చెల్లించాలని, పేద రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం సరైన పద్ధతి కాదన్నారు. స్కీం వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల సిపిఎం పార్టీ కార్యదర్శి కె రవీందర్, న్యూల్యాండ్ పరిశ్రమ సిఐటియు నాయకులు శ్రీధర్ రావు, దేవేందర్, హుస్సేన్, రవి, మరిగాని యాదగిరి పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ జయంతి



**నారాయణఖేడ్ జూలై 8 (సిరి న్యూస్):** నారాయణాఖేడ్ పట్టణ మున్సిపల్ పరిధిలోనీ ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్య మంత్రి డాక్టర్ వైయస్ రాజశేకర్ రెడ్డి జయంతి పురస్కరించుకొని వారి వేడుకల్లో పాల్గొనీ ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులార్పించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి,తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ రియాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడ్డా మహానేత అని కొనియాడారు. రాజకీయాల్లోకి అడుగు పెట్టినప్పటి నుండి ప్రజల శ్రేయస్సు కోసమే పని చేసారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ దారం శంకర్ సెట్,రమేష్ చౌహన్, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,యాదవ రెడ్డి మాజీ సర్పంచ్,మజీద్ మాజీ కౌన్సిలర్, శంకర్ ముదిరాజు,ఈశ్వరప్ప మాజీ సర్పంచ్,అశోక్ రావు,సర్దార్ నాయక్,శ్రీనివాస్ నాయక్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలపై అభిమానంతో..!




- రూ.4 లక్షల విలువైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన పూర్వవిద్యార్థి ఎంఏ కే. ఫైసల్

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 8 (సిరి న్యూస్) :** సంగారెడ్డి పట్టణ కేంద్రం జలాల్ బాగ్ లోని గాంధీ సెంటినరీ హై స్కూల్ 1987-88 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థి ఎమ్.ఏ.కే ఫైసల్ ఉచితంగా స్టడీ మెటీరియల్స్, డిజిటల్ క్లాస్ కంటెంట్ ను విద్యార్థులకు అందజేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఫైసల్ సంగారెడ్డి పట్టణ కేంద్రంలో విదుర పబ్లికేషన్ సహకారంతో గాంధీ సెంటినరీ పాఠశాలలో నాలుగు లక్షల విలువ చేసే పదవ తరగతి స్టడీ మెటీరియల్స్, డిజిటల్ క్లాస్ కంటెంట్ ను ఉచితంగా అందజేశారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న దాదాపు 36 మంది విద్యార్థులకు ప్రాక్టీస్ మేడ్ ఈజీ స్టడీ మెటీరియల్స్ సంబంధించి 7 పుస్తకాలు, టెక్స్ట్ బుక్ మేడ్ ఈజీ కి సంబంధించిన 6 వర్క్ బుక్ లను ఉచితంగా అందజేయడం జరిగింది. ఒక్కొక్క విద్యార్థికి మొత్తం 13పుస్తకాల చొప్పున రెండు సెట్స్ అందజేయడం జరిగింది. అదేవిధంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థుల కోసం డిజిటల్ క్లాస్ కంటెంట్ ఉచితంగా అందించారు. ఇలాంటి సేవా కార్యక్రమంతో ముందుకు వచ్చిన సీనియర్ జర్నలిస్ట్ ఫైసల్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో పాఠశాల యాజమాన్యం సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఫైసల్ మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడేలా ఇప్పటి నుంచే విద్యార్థులకు మంచి శిక్షణ అందాలనే ఉద్దేశంతో స్టడీ మెటీరియల్స్ డిజిటల్ క్లాస్ కంటెంట్ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. డిజిటల్ కంటెంట్ తో విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని అన్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం డిజిటల్ మయంగా మారిందని, విద్యావ్యవస్థలో కూడా డిజిటల్ లెర్నింగ్ కు ప్రాధాన్యం పెరిగిందని అన్నారు. ఇలాంటి తరుణంలో విద్యార్థులకు ఆన్లైన్ లెర్నింగ్ తప్పనిసరిగా మారింది అన్నారు. 10వ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ అని, జీవితం లో మనం ఏం చేయాలనుకుంటున్నామొ ఒక నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యం తో పాటు పోటీ తత్వం పెంపొందించుకోవాలని అన్నారు, ఇప్పటి నుండే ప్రతి విద్యార్థి కష్టపడి చదివి 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలతో జిల్లాకు, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ వినోద్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ సెంటినరీ పూర్వ విద్యార్థి సీనియర్ జర్నలిస్ట్ ఫైసల్ చేసిన సేవా కార్యక్రమం, పాఠశాల పై ఉన్న అభిమానం, అతని మంచితనం సేవాగుణం అభినందనీయమని అన్నారు. అతనిని స్ఫూర్తిగా తీసుకొని పూర్వ విద్యార్థులు పాఠశాల పురోగతికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు మొహమ్మద్ సిద్ధిఖ్, జిల్లా ఫోటో జర్నలిస్ట్ అధ్యక్షులు మహమ్మద్ అరిఫ్, జిల్లా జర్నలిస్టు మసూద్ ఇంతియాజ్ అహ్మద్ ఖాన్, సదాశివ పేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు హాజీ అలీ, జహీరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మిన్ హాజ్, పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, అకాడమిక్ ఇంచార్జ్ తేజస్విని, కృష్ణ తోపాటు జర్నలిస్టులు హరి, ఆమీర్, ఇబ్రహీం, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# వన మహోత్సవం

- ముఖ్య అతిథిగా సీఐ వెంకటేశం



**సదాశివపేట. జూలై 8 (సిరి న్యూస్) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివ పేట మంగళవారం నాడు NSS ఆధ్వర్యంలో జరుగుతున్న వన మహోత్సవంలో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశం చేతుల మీదుగా అనేక ఫల వృక్షములను నాటడం జరిగింది.వాటిలో తెల్ల నేరేడు ,పింక్ వాటర్ ఆపిల్, తెలుపు వాటర్ ఆపిల్, రెడ్ పనస, సీతాఫలం బెర్రీ, నారింజ, సపోటా ,జామ మొదలగు పల వృక్షములను కళాశాల గార్డెన్లో నాటడం జరిగింది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశం మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించ వలసిన బాధ్యత ప్రతి విద్యార్థి పై ఉన్నదని మొక్కలు నాటాలని నాటిన మొక్కను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో అనేక మెడిసిన్ ప్లాంట్స్ పలవృక్షములు ఇతర వృక్షములు నాడటం జరిగిందని ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొనటం సంతోషించదగ్గ అంసమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి మురళీకృష్ణ మాట్లాడుతూ మెడిసిన్ ప్లాంట్ ఫల వృక్షములు నాటడం జరిగిందని ఒక్కొక్క మొక్కను ఒక్కొక్క విద్యార్థికి దత్తత ఇవ్వటం జరుగుతుందని,దత్తత తీసుకున్న మొక్కను ఆ విద్యార్థి సంరక్షిస్తాడని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, ఎన్సిసిసి సి సర్టిఫికెట్ పొందాన విద్యార్థిని విద్యార్థులు అనేక రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ, సర్వయ్య సావిద్య, డాక్టర్ రాజిరెడ్డి ,శంకరయ్య ,నాన్ టీచింగ్ స్టాఫ్ మైకాన్,రాధా, లాలయ్య, విద్యార్థి విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పిల్లలకు చట్టలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య
- బాలసదన్‌ను ఆకస్మిక తనిఖీ



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 8 (సిరి న్యూస్) :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర ఆదేశాల ప్రకారం మంగళవారం భరోసా, బాలసదన్, సంగారెడ్డి నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య తనిఖీ నిర్వహించటం జరిగినది. ఈ తనిఖీ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలి అన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు. మంచి చదువులు చదివి ఉన్నత ఎదుగుదల ఎదగాలని అన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 8 (సిరి న్యూస్) :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, తదితర డిమాండ్ల సాధన కోసం జాతీయ కార్మిక సంఘాల తో పాటు, రాష్ట్ర కార్మిక సంఘాలు, వివిధ సంస్థలు, ఫెడరేషన్లు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, ఈ సమ్మెలో కార్మిక వర్గం, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు కోరారు. సోమవారం సంగారెడ్డి పరిధిలోని పెప్సి పరిశ్రమ ఎదుట జరిగిన సమ్మె ప్రచార జాతలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి, కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్నది అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అందరూ పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు భీమ్ రెడ్డి, షఫీ, శివ, సత్య నారాయణ, ప్రభాకర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, సురేష్, చంద్రన్న, అలీ భాయి తది తరులు పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.